

జిఓ1 కాపీలు దహనం

కొయ్యలగూడెం:సభలు, సమావేశాల నిర్వహణపై నిర్బంధాలను విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ1ని రద్దు చేయాలని కోరుతూ మండలంలో రైస్ మిల్ అండ్ బజార్ జట్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిఓ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు శుక్రబోయిన రాంబాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను రక్షించాలన్నారు. హక్కులకు విఘాతంగా ఉన్న ఈ జిఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రైస్ మిలు వద్ద జిఓ కాపీలను దహనం చేశారు. మరో నేత బి.సోమయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపే హక్కులను కాలరాస్తున్న ఈ జిఓను రద్దు చేయాలన్నారు. ముందస్తు ఎన్నికలు వస్తున్నాయని అధికార పార్టీ ప్రభుత్వం మీద వ్యతిరేకత ఉన్నవారిని నిరసన తెలియజేయకుండా, రోడ్డు ఎక్కనీయకుండా నిరంకుశంగా అణగదొక్కేందుకు ఈ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, కె.సీతారాముడు, మిద్దే వెంకటేష్, పి.శ్రావణ్, దుర్గారావు, మధు, సురేష్ పాల్గొన్నారు.

రవాణా వాహనాలపై

పన్ను పెంపును ఉపసంహరించాలి

సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రంలో సరకు, ప్రయాణికుల రవాణా వాహనాలపై మోపిన 30శాతం త్రైమాసిక పన్నును తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన జిల్లా కార్యదర్శివర్గ సభ్యుల సమావేశానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి హాజరైన సీతారాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల డీజిల్ ధరలు పెరగడం, కరోనాతో కోలుకోలేని దెబ్బతినడం వల్ల రవాణారంగం కుదేలయిందన్నారు. ప్రతి సంవత్సరం టోల్‌గేట్ రేట్లు 15 శాతం పెంచుతున్నారని, కిస్తీలు కట్టలేక, కిరాయిలు రాక, వాహనాల మెయింటినెన్స్ పెరిగి లారీ ఓనర్లు దివాళాతీసే స్థితిలో ఉన్నారన్నారు. జిఒ నెం.21తో రాష్ట్రంలో చలానాలు, జరిమానాలు మూడు రెట్లు పెరిగాయన్నారు. గ్రీన్ టాక్స్ పేరుతో పెంచిన పన్ను భారానికి వ్యతిరేకంగా యజమానులు ఆందోళన చేస్తూనే ఉన్నారని, ఈ పన్నును తగ్గించకపోగా ఇప్పుడు త్రైమాసిక పన్నును 30శాతం పెంచడం మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు ఉందని ఎద్దేవా చేశారు. దీనివల్ల పరోక్షంగా రూ.200 కోట్ల భారం ప్రజలు/వినియోగదారులపై పడుతుందని తెలిపారు. రవాణా శాఖ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, మంత్రులకు, అధికారులకు విన్నపాలు చేసినా ఫలితం లేదన్నారు. రవాణారంగంపై ఆధారపడి లక్షలాది మంది కార్మికులు జీవిస్తున్నారని, ఈ రంగాన్ని కాపాడుకోవడం రాష్ట్ర శ్రేయస్సుకు అవసరమన్నారు.రవాణా వాహనాలపై పన్నులు పెంచడమంటే అంతిమంగా ప్రజలపై భారం వేయడమేనని, డీజిల్, పెట్రోలు ధరలు పెరగడంతో నిత్యావసర సరుకుల ధరల పెరిగి ఇప్పటికే ప్రజలు నతమతమవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు అసరా, తోడు అంటూ మరోవైపు పన్నులు, ధరలు పెంచడం ప్రజలను దగా చేయడమేనని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రహదారులు, కూడళ్లలో సభలు, ర్యాలీలను నిషేధిస్తూ జిఒ నెం.1ని ఈ నెల 23 వరకూ సస్పెండ్ చేస్తూ రాష్ట్ర హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దీన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రసాద్, జి.రాజు, నాగమణి మాట్లాడారు.

ఉత్తర్వులు రద్దు చేయాలి

రాష్ట్రంలో తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రవాణారంగంపై త్రైమాసిక రోడ్ టాక్స్ పెంచుతూ మరో భారాన్ని వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బుద్ధ నాగసూరిబాబు, జె.గోపి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారొక ప్రకటన విడుదల చేశారు. కోవిడ్ అనంతరకాలంలో పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న రవాణా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోకపోగా రహదారుల మరమ్మతుల పేరుతో పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూపాయి చొప్పున పన్ను విధించిందని, కానీ రాష్ట్రంలో ఎక్కడా రహదారులు మరమ్మతులు చేయలేదని విమర్శించారు. జాతీయ రహదారులన్నీ టోల్ టాక్స్‌లు పెంచడం వల్ల మోయలేని భారంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా ఇచ్చిన త్రైమాసిక రోడ్ టాక్స్ 30శాతం పెంపును ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా రవాణా రంగ కార్మికులను ఐక్యం చేసి పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

జోడి

పెద్దఎత్తున కోడి పందేలకు రంగం సిద్ధం
కార్లు, బైక్‌ల పేరిట భారీ ఆఫర్లు
బరులు చదును చేస్తున్న పందెంరాయుళ్లు
పోలీసుల హెచ్చరికలు బేఖాతరు



కాళ్ల మండలం సీసలిలో పందాలకు సిద్ధంచేసిన బరి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గతంకంటే భిన్నంగా కోడిపందేలు నిర్వహించేందుకు పందెంరాయుళ్లు సిద్ధమవుతున్నారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశారు. బరులను చదును చేసే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కోడిపందేలను అడ్డుకుంటామంటూ పోలీసుల హెచ్చరికలు ఏటా మాదిరిగానే ఈసారీ కొనసాగుతున్నా పందెంరాయుళ్లు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. కోర్టుకు చెప్పుకునేందుకే బైండోవర్ కేసులు, పలుచోట్ల బరుల ధ్వంసం ఫొటోలు వంటివి పోలీసులు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. భోగి రోజు ఉదయం నుంచి పందేలు ప్రారంభం కానున్నట్లు పందెంరాయుళ్లు ధీమాగా చెబుతున్నారు. ఈసారి జోడి పందేల నిర్వహణ పేరుతో భారీ పందేలకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ఎక్కువ పందేలు గెలిచిన వారికి బహుమతిగా కారు, బైక్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో భీమవరం సమీపంలోని పెన్నాడలో జోడి పందేలు గెలిచిన వారికి బైక్ ఇచ్చినట్లు పెద్దఎత్తున చెప్పుకున్నారు. ఈసారి ఆకివీడు, కాళ్ల,, కైకలూరు మండలాలతోపాటు పలుచోట్ల బహుమతుల కింద కార్లు, బైక్‌లు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. జోడిపందేల కింద ఐదు పందేలు నిర్వహిస్తే మూడు పందేలు గెలిచిన వారికి ఈ బహుమతులు ఇస్తారు. ఒకవేళ మూడు పందేలు నిర్వహిస్తే రెండు పందేలు గెలిచిన వారికి బహుమతులు అందజేస్తారు. బహుమతిగా కారు పెట్టినచోట తొమ్మిది పందేలు నిర్వహించి ఐదు పందేలు గెలిచిన వారికి ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. పందెంరాయుళ్లను ఆకర్షించేందుకు జోడి పందేలపై విపరీతమైన ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో జోడి పందేల్లో బెట్టింగ్ కింద ప్రతి పందేనికి రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకూ కొనసాగనున్నట్లు చెబుతున్నారు. జోడి పందేల్లో పాల్గొనే వారు ప్రత్యేక తర్ఫీదు ఇచ్చిన పుంజులను పందేల్లో దింపేందుకు సిద్ధమవుతున్నారు. దెందులూరు, పెదవేగి, జంగారెడ్డిగూడెం, ఏలూరు వంటి పలుచోట్ల సైతం పెద్దఎత్తున పందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పందేల ఏర్పాట్లు స్థానిక ఎంఎల్‌ఎల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కడ పందేలు నిర్వహించాలి.. ఎవరికింత మామూళ్లు ఇవ్వాలో సైతం ప్రజాప్రతినిధులే నిర్ణయిస్తున్నట్లు చెబుతున్నారు. పందేలను అంతా తిలకించే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నిడమర్రు మండలం మందలపర్రులో భారీ పందేలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇదే గ్రామంలో ప్రధాన రహదారికి పక్కగా పెద్దఎత్తున పందేలు నిర్వహించినా అడ్డుకున్న నాథుడే లేడు. గడిచిన రెండేళ్లుగా కోవిడ్ నేపథ్యంలో పందేల్లో పాల్గొనేందుకు కొంత జంకేవారు. ఈసారి అటువంటి పరిస్థితి లేకపోవడంతో జనాన్ని పెద్దఎత్తున పందేలకు ఆకర్షితులను చేసేందుకు బరుల నిర్వాహకులు బహుమతుల పేరుతో వల వేస్తున్నట్లు తెలుస్తోంది.

కాళ్ల: పందెం కోడి కాలు దువ్వుతోంది. లక్షలు చేతులు మార్చుకోవడానికి పందెంరాయుళ్లు సన్నద్ధమయ్యారు. మండలంలో పలు గ్రామాల్లో భారీస్థాయిలో కోడిపందేలకు రంగం సిద్ధమైంది. సీసలిలో ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు పొలంలో కోడి పందేల బరిని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మండలంలో జువ్వలపాలెం, కాళ్లకూరు, కాళ్ల, జక్కరం, పెదఅమిరం, సీసలి గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు కోడిపందేల బరులను సిద్ధం చేస్తున్నారు.

సీసలిలో ఫ్లడ్ లైట్లు సైతం ఏర్పాటు

సీసలిలో పదెకరాల పొలంలో బరిని సిద్ధం చేసి పెద్ద పందేలు వేసే చోట భారీ క్లాత్ టెంట్ ఏర్పాటు చేశారు. బరి చుట్టూ అల్యూమినియం మెస్ ఏర్పాటు చేశారు. బరిలోకి వచ్చి వెళ్లేందుకు రెండు మార్గాలను ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి సమయాల్లోనూ పందేలు కొనసాగించేందుకు ఫ్లడ్‌లైట్లు, గ్యాలరీలు సైతం ఏర్పాటు చేస్తుండటం విశేషం.

పెనుమంట్ర: కోడి పందేల నిర్వహణకు బరులు ఇప్పటికే సిద్ధమయ్యాయి. ముఖ్యంగా నత్తారామేశ్వరం, గరువు, ఆలమూరు, మార్టేరు పరిధిలో పందేల నిర్వహణకు ఆయా గ్రామాల్లో అధికార పార్టీ నేతలు, పెద్దల అండదండలతో బరుల ఏర్పాట్లు గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నాయి. ఈ బరుల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే కొన్ని చోట్ల వేలం పాట కూడా నిర్వహిస్తున్నట్లు సమాచారం.

మూడు రోజులు మౌనమేనా..?

కోడిపందేలను అడ్డుకుంటామని పోలీసు, రెవెన్యూ అధికారులు చెబుతున్న మాటలన్నీ భోగిరోజు ఉదయం వరకేనని పందెంరాయుళ్లు ఢంకా బజాయించి మరీ చెబుతున్నారు. భోగి రోజు నుంచి మూడు రోజులపాటు పోలీసులు మౌనం వహించాల్సిందేనని అంటున్నారు. ప్రతియేటా ఇదే తంతు జరుగుతున్న పరిస్థితి నెలకొంది. ఎంఎల్‌ఎల కనుసన్నల్లో తయారవుతున్న బరుల జోలికి పోలీసులు వెళ్లడం లేదని, చోటమోటా బరులను మాత్రమే ధ్వంసం చేస్తున్నట్లు చెబుతున్నారు. పోలీసులు ఏం చేసినా భోగిరోజు వరకేనని, తర్వాత వారంతా ప్రేక్షక పాత్రకు పరిమితం కావాల్సిందేనని పందెంరాయుళ్లు ధీమాగా ఉన్నారు. గుండాట, మూడు ముక్కలాట వంటి జూద క్రీడలకు సైతం బరుల వద్ద అనుమతించే పరిస్థితి నెలకొంది. అదే జరిగితే పందేలు చూసేందుకు వచ్చే సామాన్య ప్రజానీకం సైతం జేబులు గుల్లచేసుకునే పరిస్థితి ఏర్పడనుంది.

కోడి పందేలను అరికట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

సంక్రాంతి సందర్భంగా జిల్లాలో కోడిపందేలు, జూదం, పేకాట వంటి వాటిని అరికట్టాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. సమాజంలో కోడిపందేలు, జూదం, పేకాట, మత్తు పదార్థాలు, గంజాయి వంటివి ప్రజల జీవితాలను అస్తవ్యస్థం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధానంగా ఈ వ్యసనాలు యువతీ యువకులను, విద్యార్థులను లొంగదీసుకుంటున్నాయని తెలిపారు. ఈ చట్ట వ్యతిరేక చర్యల పట్ల ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని రవి డిమాండ్ చేశారు. ఈ వ్యసనాల నుంచి వారి దృష్టి మరల్చేందుకు గ్రామాలు, పట్టణాల్లో ఆటల పోటీలు నిర్వహించి, యువతీ యువకులను, క్రీడాకారులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. పండుగ అనేది వ్యసనాలకు అవకాశం ఇచ్చేదిగా కాకుండా ఆహ్లాదంగా, ఆనందంగా జరుపుకోవాలని, అయితే కోడిపందేలు, జూదం, పేకాట వంటివి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని తెలిపారు. ఇటువంటి వాటిని రాష్ట్ర ప్రభుత్వం, అధికార, పోలీసు యంత్రాంగాలు కట్టుదిట్టమైన చర్యల ద్వారా కట్టడి చేయాలని కోరారు. గ్రామాలు, పట్టణాల్లో చాలామంది మట్టిలో మాణిక్యాలు ఉన్నారని, వారిని ప్రోత్సహిస్తే రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకొస్తారని పేర్కొన్నారు. అనేక సంస్థలు, సంఘాలు సంక్రాంతి సందర్భంగా ఆటల్ని నిర్వహిస్తున్నాయని తెలిపారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిర్వహించాలని కోరారు. పోలీసు యంత్రాంగం పండుగకు ముందు వరకు కోడిపందేలు, జూదం, పేకాట వంటి వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెబుతున్నా, రాష్ట్ర ప్రభుత్వ మౌఖిక అనుమతులతో కిమ్మనకుండా ఉంటున్నారని ఆయన విమర్శించారు. సాక్షాత్తూ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు గత సంవత్సరం దగ్గరుండి కోడిపందేలు నిర్వహించడం సిగ్గుచేటని పేర్కొన్నారు. వీటిలో పాల్గొనే ప్రజాప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కోర్టులు సుమోటోగా ఇటువంటి వాటిని స్వీకరించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పండుగలను ఆహ్లాదకరంగా, ఆనందంగా జరుపుకోవాలని, క్రీడలను ప్రోత్సహించాలని, చట్టవ్యతిరేకమైన వాటిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని బలరాం కోరారు.

ఉపాధ్యాయుల పని విభజన వాయిదా వేయాలి

ఫ్యాప్టో

ప్రజాశక్తి - ఏలూరు

బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ కోర్టు పరిధిలో ఉన్నందున తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలకు అనుసరించే ప్రక్రియలో భాగంగా విద్యా కమిషనర్, పాఠశాల విద్యా ప్రిన్సిపల్ కార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వులు భిన్నంగా ఉన్నాయని, దీనివల్ల గందరగోళం ఏర్పడుతుందని వెంటనే పని విభజన ప్రక్రియ వాయిదా వేయాలని ఎపి ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో జిల్లా శాఖ డిమాండ్ చేసింది. బదిలీలు, ప్రమోషన్లు కోర్టు పరిధిలో ఉన్నందున తాత్కాలిక నియామకాలు చేపడతామని, ప్రమోషన్స్ వారికి రూ.2500 ఇస్తామని కమిషనర్ ఉత్తర్వులిచ్చారని, అలాగే జనవరి 20వ తేదీ నుండి ఇలా పని విభజన చేసిన వారికి నూతన ప్రదేశంలో జీతం ఇస్తామని ప్రిన్సిపల్ కార్యదర్శి ఉత్తర్వులిచ్చారని దీనివల్ల ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. ప్రమోషన్స్ వారికి ఇస్తామని చెప్పిన సొమ్ముకు ఆర్థిక శాఖ అనుమతిచ్చిందా? నూతన పాఠశాలల్లో జీతం అంటే క్యాడర్ స్ట్రెంగ్త్ సర్దుబాటు ఫైనాన్స్ వారి అనుమతి ఏమిటి? అనేదానిపై అస్పష్టత ఉందా, సీనియారిటీ, స్థానాల డిస్‌ప్లేపై కూడా స్పష్టత లేదని పేర్కొన్నారు. ఇంత అస్పష్టంగా ఉన్న ఉత్తర్వులు కారణంగా కౌన్సెలింగ్‌ను తాత్కాలికంగా వాయిదా వేసి సంక్రాంతి సెలవుల అనంతరం సంఘాలతో చర్చించి నిర్వహించాలని ఫ్యాప్టో డిమాండ్ చేసింది. విజ్ఞాపన పత్రాన్ని కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డిఆర్‌ఒ మూర్తికి, రీజినల్ జాయింట్ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి మధుసూదన్‌రావుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పి.నారాయణ, సెక్రటరీ జనరల్ జి.వెంకటేశ్వరరావు, ఫ్యాప్టో నాయకులు రవికుమార్, పివి.నరసింహారావు, జి.కృష్ణ, రామారావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

వైసిపి ఓటమి ఖాయం : దేవినేని

ప్రజాశక్తి - చాట్రాయి

వచ్చే ఎన్నికల్లో వైసిపిని ప్రజలు ఓడించడం ఖాయమని నీటిపారుదల శాఖ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. చీపురుగూడెంలో నిలిచిపోయిన చింతలపూడి ఫేజ్-2 ఎత్తిపోతలకాలువ పనులను గురువారం ఆయన పరిశీలించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ పనులకు శంకుస్థాపన చేశారని తెలిపారు. చీపురుగూడెం, కోటపాడు, బూరుగుగూడెం గ్రామాల్లోని రైతులు తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతోనే కాలువకు భూములిచ్చారని, ప్రభుత్వం మారడంతో ఆ పనులు నిలిచిపోయాయన్నారు. వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని, కాలువకు భూములిచ్చి సహకరించిన రైతుల ఆశలు నీరుగారిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. నిలిచిపోయిన కాలువ పనులు మళ్లీ ప్రారంభమవుతాయని, గోదావరి నీళ్లు చాట్రాయి మండలానికి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ ముద్రబోయిన వెంకటేశ్వరరావు, తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి సేవల దేవదత్, చింతలపూడి మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలందించాలని, వారికి అందుబాటులో ఉండాలని డిఎల్‌డిఒ ఎం.రాజు సిబ్బందికి సూచించారు. గురువారం జీలుగుమిల్లి మండలంలోని దర్భగూడెం, జీలుగుమిల్లి, తాటియాకులగూడెం, సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయాలను రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. అందుకు అనుగుణంగా సిబ్బంది పనితీరు మార్చుకోవాలని సూచించారు. కొంతమంది సిబ్బంది విధులో అలసత్వం వహిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి వారు పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. వాటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి కేంద్రాల్లో సంపదను తయారీ చేసి పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.మంగతాయారు, కార్యదర్శులు దేవప్రియుడు, అశోక్, వీరలక్ష్మి, సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి : వ్యకాస

ప్రజాశక్తి - ఏలూరు

ఉపాధి హామీ చట్టంలో అవినీతికి పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం డ్వామా పీడీ దుండి రాంబాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న మండలస్థాయి అధికారులు పథకాన్ని నీరుగార్చే విధంగా అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో పనిచేయని వారికీ మస్తర్లు వేసి అసలు పనికి వచ్చే కూలీలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రలోభాలకు లొంగి కొంతమంది అధికారులు చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. వారిపై జిల్లా, రాష్ట్ర అధికారులు పర్యవేక్షణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం, కోయ్యాలగూడెం, ఉంగుటూరు, పెదవేగి, దెందులూరు, లింగపాలెం, చింతలపూడి మండలాల్లో చాలా సందర్భాల్లో మండల స్థాయి అధికారులు అవినీతికి పాల్పడిన ఘటనలు ఈ సంవత్సరంలో బయటపడ్డాయని తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. టి.నరసాపురం మండలంలో మండలస్థాయి అధికారులే ఫీల్డ్ అసిస్టెంట్లను, టెక్నికల్ అసిస్టెంట్లను ప్రోత్సహిస్తూ అవినీతికి పాల్పడుతున్నప్పటికీ పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఉంగుటూరు, దెందులూరు, పెదవేగి మండలాల్లో మండలస్థాయి అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతికి పడిన ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దెందులూరు, పెదవేగి మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పనికిరాని వారికి, భూస్వాములకు రాజకీయ నాయకుల ప్రలోభాలకు లొంగి మస్తర్లు వేస్తున్నారని విమర్శించారు. అర్హులైన పేదలకు రోజువారి పని చేసే కూలీలకు మాత్రమే పనికి వచ్చిన డబ్బులు వేయడంలో జాప్యం జరుగుతుందని ఎద్దేవా చేశారు. పనికి రాకుండా ఇంటి దగ్గర ఉండే పెత్తందారులకు, భూస్వాములకు మస్తర్లు వేసి ఉపాధి పథకాన్ని నీరుగారుస్తున్నారని విమర్శించారు. కొయ్యలగూడెం, దెందులూరు, పెదవేగి మండలాల్లో టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆగడాలపై పర్యవేక్షణ చేయాలని, అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పనుల సీజన్లలో ఉపాధి పనులు పెట్టడం వల్ల కూలీలకు నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, ఉపాధ్యక్షులు ఎ.రవి పాల్గొన్నారు.

పట్టిసీమ శివక్షేత్రం యాత్రికులకు పటిష్ట ఏర్పాట్లు

ఆర్‌డిఒ ఎం.ఝాన్సీరాణి

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ శివక్షేత్రంలో మహాశివరాత్రికి అన్ని ప్రభుత్వ శాఖాధికారులను సమన్వయం చేసుకుని యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని పట్టిసీమ వీరేశ్వరస్వామి ఉత్సవ కమిటీ ఛైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎం.ఝాన్సీరాణి తెలిపారు. గురువారం పట్టిసం సచివాలయం వద్ద వచ్చేనెల 18వ తేదీన మహాశివరాత్రి పండుగ సందర్భంగా 17వ తేదీ నుండి 19వ తేదీవరకూ జరిగే ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా, డివిజన్, మండల శాఖాధికారులతో సమన్వయ సమావేశం ఆర్‌డిఒ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ వారి వారి శాఖల పనులను చేపట్టాలన్నారు. యాత్రికుల క్యూలైన్లలో తొక్కిసలాట జరుగకుండా పోలీసు అధికారులు చేపట్టే విధులను లతాకుమారి వివరించారు. దేవాదాయశాఖ తరపున దేవాలయ పరిధిలో లైటింగ్, క్యూలైన్లు, ఉచిత ప్రసాదం, ఉచిత దర్శనం, రూ.20, రూ.50, రూ.300, ప్రత్యేక దర్శనం కౌంటర్లను ఏర్పాటు, విఐపి క్యూలైన్స్, అత్యవసర మార్గం, తదితర ఏర్పాట్లు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. యాత్రికులకు మజ్జిగ, పులిహోర, పిల్లలకు పాలు, వాటర్ ప్యాకెట్లు అందిస్తామన్నారు. పారిశుధ్యం, లైటింగ్, డస్ట్ బిన్స్, మహిళల స్నానాల గదులు, చలువ పందిళ్లు, తదితర ఏర్పాట్లను వివరించారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి వాటర్ ప్యాకెట్లు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లను అధికారులు వివరించారు.

ఆర్‌టిసికి సంబంధించి 110 బస్సులు వివిధ బస్ డిపోల ద్వారా నడుపుతామని, వీటికి ప్రత్యేకమైన తాత్కాలిక బస్టాండ్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అగ్నిమాపక శాఖ ద్వారా ఫైర్‌ఇంజన్ వాహనం, రిస్క్ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. మత్స్యశాఖ ద్వారా 200 మంది గజ ఈతగాళ్లను నియమిస్తామని అధికారులు చెప్పారు. పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి మాట్లాడుతూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో యాత్రికులు స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో సర్పంచి ఎస్.శ్రీరామ్మూర్తి, తహశీల్దార్ బి.సుమంతి, సిఐ విజయకుమార్, ఎస్సై పవన్ కుమార్, దేవాదాయశాఖ ఆర్‌జెసి సురేష్ కుమార్, డిసి విజయరాజు పాల్గొన్నారు.



ధన్యజీవి అక్కినేని

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి - పెదపాడు/ఏలూరు టౌన్

కమ్యూనిస్టు అభిమాని, నర్రా ఆంజనేయులు ట్రస్ట్ నిర్వాహకులు, సేవాతత్పరుడు, నాయుడుగూడెం మాజీ సర్పంచి అక్కినేని సత్యనారాయణ(సత్యం) ధన్యజీవి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం కొనియాడారు. సత్యనారాయణ సంస్మరణ సభ నాయుడుగూడెంలోని అక్కినేని శ్రీవల్లి గ్రంథాలయ ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ సభకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముందుగా సత్యనారాయణ (సత్యం) చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంస్మరణ సభలో సీతారాం మాట్లాడుతూ తను తన కుటుంబం కోసమే కాకుండా సమాజానికి సేవ చేయాలనే దృక్పథంతో ఖచ్చితమైన మనస్తత్వంతో ముక్కుసూటిగా వ్యవహరిస్తూ అమరజీవి నర్రా ఆంజనేయులు ట్రస్టు ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. తుది శ్వాస వరకూ కమ్యూనిస్టు సిద్ధాంతం పట్ల నమ్మకంతో ఉన్నారని, కమ్యూనిస్టులు అయితేనే సమాజానికి సేవ చేస్తారని ఆయన విశ్వసించారని చెప్పారు. నాయుడుగూడెం ప్రాంతం ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోటగా ఉండేదని చెప్పారు. అనేకమంది ఈ ప్రాంతంలో కమ్యూనిస్టులుగా మారి కష్టజీవులకు నిలబడి అనేక త్యాగాలు చేశారని చెప్పారు. సర్పంచిగా పని చేసిన కాలంలో గ్రామాభివృద్ధికి అక్కినేని విశేష కృషి చేశారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ సత్యం మరణానంతరం తన భౌతికకాయాన్ని ఆశ్రం మెడికల్ కాలేజీకి ఇవ్వడం ఆదర్శమన్నారు. నాయుడుగూడెంలో గ్రంథాలయం ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్య అందించాలనే ఆయన ఆశయం గొప్పదని చెప్పారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, వేములపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొమ్మన లక్ష్మణరావు, వేములపల్లి సత్యనారాయణ, గారపాటి మోహనరావు, అక్కినేని సత్యనారాయణ కుమార్తె శేష కుమారి, కుమారులు సతీష్, సీతారాం ప్రసాద్, సిపిఎం నాయకులు మావూరి శ్రీనివాసరావు, పిల్లి రామకృష్ణ, గుండపనేని సురేష్, లింగం కృష్ణారావు, అక్కినేని వెంకటేశ్వరరావు, పిట్టా రహోయేలు, షేక్ కరీముల్లా పాల్గొన్నారు.

సంక్రాంతి ఆటల పోటీలను ప్రభుత్వం నిర్వహించాలి: డివైఎఫ్ఐ

జంగారెడ్డిగూడెం:యువత జూద క్రీడల వైపు మొగ్గు చూపకుండా ప్రభుత్వమే సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ అన్నారు. గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో మునిగితేలుతున్న యువత వ్యసనాలకు లోనవ్వకుండా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహించాలని కోరారు. మండలాల వారీగా క్రీడా ప్రాంగణాలు కేటాయించి పోటీలు నిర్వహించాలన్నారు. సంక్రాంతి ఆటల పోటీలకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి ఆటలు పోటీల్లో యువతీ, యువకులు పెద్ద ఎత్తున పాల్గొవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పెద్దలు, అధికారులు క్రీడలను ప్రోత్సహిస్తూ విరివిగా విరాళాలిచ్చి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.యశ్వంత్, ఎం.మణి, చిన్ని, రాంబాబు పాల్గొన్నారు.

దెబ్బతిన్న మినుము పైరు పరిశీలన

ప్రజాశక్తి వార్తకు స్పందన

ముదినేపల్లి : ముదినేపల్లి పోల్‌రాజ్ కెనాల్ వెంబడి దెబ్బతిన్న మినుము పంటలను ఎట్టకేలకు అధికారులు పరిశీలించారు. ఈ కెనాల్‌కు నిండుగా ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేయడంతో కాలువకు ఇరువైపుల ఉన్న మినుము పంటల్లోకి ఊట నీరుచేరి దెబ్బతిన్నాయి. దీనిపై 'పోల్‌రాజ్‌కెనాల్‌కు సామర్థ్యానికి మించి నీటి విడుదల' శీర్షికతో గురువారం ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కెనాల్ సెక్షన్ ఎఇఇ వికెవి.కిషోర్ స్పందించారు. కిషోర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో ఆయన ప్రజాశక్తి విలేకరికి ఫోన్‌చేసి పైరు దెబ్బతిన్న రైతు వివరాలు తెలుసుకుని రైతును వెంటబెట్టుకుని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎఇ కృష్ణ ఈస్ట్రన్ డివిజన్ విజయవాడ వారి ఆదేశాలు మేరకు పోల్‌రాజ్ ప్రధాన కాలువకు ఈనెల15వ తేదీ వరకూ తాగునీటి చెరువులకు నీటి సరఫరా జరుగుతుందన్నారు. పోల్‌రాజ్ ప్రధాన కాలువ పూర్తిస్థాయి సామర్థ్యం 630 క్యూసెక్కులు అని, ప్రస్తుతం 390 క్యూసెక్కులు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. శుక్రవారం నుంచి గుడ్లవల్లేరు లాకుల వద్ద 50 క్యూసెక్కులకు నీటి సామర్థ్యం తగ్గించనున్నట్లు తెలిపారు. అప్పుడు కాలువలో 340 క్యూసెక్కులు మాత్రమే సరఫరా అవుతుందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామన్నారు. పోల్‌రాజ్ ప్రధాన కెనాల్ పక్కన ఉన్న ఊట బోదె లేని పొలాలకు మాత్రమే నీరు చేరుతుందన్నారు. రైతులు ఊట బోదె ఏర్పాటు చేసుకుంటే ఈ సమస్య తలెత్తదన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సంక్రాంతి సంబరాల్లో వివాదం

వికాస్‌లో పోలీసులు - సిబ్బంది మధ్య తోపులాట

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక వికాస్ విద్యాసంస్థల సంక్రాంతి సంబరాల్లో పోలీసులకు విద్యాసంస్థల సిబ్బందికి మధ్య వివాదం నెలకొంది. ఈ వివాదంలో ఆందోళనకు గురై పరుగులు పెట్టిన విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీ రాత్రి స్థానిక వికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సంక్రాంతి సంబరాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులతో పాటు అధిక సంఖ్యలో పాల్గొన్న తల్లిదండ్రులతో ప్రాంగణమంతా నిండిపోయింది. ఈ క్రమంలో రాత్రి తొమ్మిది గంటల సమయంలో కార్యక్రమం ముగించాలని పోలీసులు వికాస్ సిబ్బందికి సూచించారు. అయినప్పటికీ వికాస్ విద్యాసంస్థల సంక్రాంతి సంబరాలు కొనసాగడంపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రాంగణాన్ని ఖాళీ చేయించేందుకు పోలీసులు విచక్షణా రహితంగా ప్రవర్తించారని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు. తామంతా పరుగు తీసే పరిస్థితి నెలకొందన్నారు. ఈ క్రమంలో పోలీసులతో వాదన పడుతున్న కరెస్పాండెంట్ వి.జగన్నాధరావుతో పాటు మరో ఏడుగురు సిబ్బందిని పోలీసులు అరెస్టు చేశారని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు. దీనిపై ఎస్ఐ సాగర్‌బాబును వివరణ అడుగగా సంక్రాంతి సంబరాలు నిర్వహించుకోవడం కోసం జనవరి 11వ తేదీ రాత్రి అనుమతించినప్పటికి 1.30 గంటలకు కూడా డిజె సౌండ్‌లతో పక్క నివాసాలకు ఇబ్బంది కలిగిందని తెలిపారు. దీంతో అక్కడకు వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ మోషే విధులకు ఆటంకం కలిగిస్తూ దాడి చేశారన్నారు. మోషేకు గాయాలవ్వడంతో ఏరియా ఆసుపత్రిలో చేర్చామని తెలిపారు. మోషే ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి వికాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ జగన్నాధరావుతో పాటు మరో తొమ్మిది మంది సిబ్బందిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు.

విద్యార్థుల తల్లిదండ్రులపై లాఠీచార్జి దుర్మార్గం

స్థానిక వికాస్ విద్యాసంస్థల సంక్రాంతి సంబరాలలో పోలీసులు విచక్షణారహితంగా విద్యార్థులు తల్లిదండ్రులపై లాఠీచార్జి చేయడం దుర్మార్గమని విద్యాసంస్థల కరస్పాండెంట్ వి.జగన్నాధరావు భార్య సౌజన్య అన్నారు. మూడో తరగతి అభ్యసిస్తున్న తన కుమారునిపై దాడి చేశారని తెలిపారు. ఈ సంఘటనపై జిల్లా ఎస్పి రాహుల్ దేవ్ శర్మకు ఫిర్యాదు చేసి స్థానికేతర పోలీస్ అధికారితో పూర్తి విచారణ జరపాలని కోరినట్లు తెలిపారు. వికాస్‌లో సంబరాలకు వెళ్లిన తమపై పోలీసులు దాడి చేశారని కొండపల్లి లక్ష్మి, ఎన్.శైలజ ఫిర్యాదు చేశారు.

పోలవరం నిర్వాసితులకు అండగా ఉంటాం : అఖిలపక్షం

వేలేరుపాడు :పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు అండగా ఉంటామని అఖిలపక్ష నాయకులు అన్నారు. మండలంలోని స్థానిక సిపిఐ కార్యాలయ లో సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము అధ్యక్షతన అఖిలపక్ష నాయకులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నెంబర్-1 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 14వ తేదీన భోగిమంటల్లో జిఒ కాపీలను దహనం చేస్తామని, 16వ తేదీన నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, సిపిఎం జిల్లా నాయకులు మడివి దుర్గారావు, టిడిపి నాయకులు అమరవరపు అశోక్, కొమ్మన వెంకటేశ్వర్లు, సిపిఐ, కాంగ్రెస్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఏలూరు రేంజ్ డిఐజి పాలరాజు సతీమణి లావణ్య, ఎస్పి రాహుల్‌దేవ్‌శర్మ సతీమణి సాక్షిశర్మ భోగి మంటలను వెలిగించారు. సంప్రదాయ క్రీడలు, కోలాటం, రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

ముదినేపల్లి :మండలంలోని పలు విద్యాసంస్థల్లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముదినేపల్లిలోని గౌతమ్ హైస్కూల్‌లో విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎవిఎన్ పాలిటెక్నిక్ కళాశాల నిర్వాహకురాలు కె.తనుజా బహుమతులు ప్రదానం చేశారు.

టి.నరసాపురం : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగని విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ అన్నారు. స్థానిక విజన్ స్కూల్‌లో గురువారం ముత్యాల ముగ్గుల పోటీలు, సంక్రాంతి పండుగ సంబరాలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందించారు.

ముసునూరు : మండలంలోని చెక్కపల్లి గ్రామంలో చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సంక్రాంతి సంబరాలు ప్రిన్సిపల్ మరీదు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రమైన ముసునూరు భారతీయ విద్యా నికేతన్ పాఠశాలలో ప్రిన్సిపల్ కొండేటి శౌరి మాస్టర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు.

చేతి పంపులకు హెడ్‌లు ఏర్పాటు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని కైకలూరు రోడ్డులో ప్రజల దాహార్తి తీర్చేందుకు గతంలో దాతలు ఏర్పాటు చేసిన మూడు చేతి పంపుల హెడ్‌లను బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మండల కోఆప్షన్ సభ్యులు షేక్ అల్లాభక్షు పంపుల హెడ్‌లను బిగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఐదు గ్రామాల ప్రజలు అల్లాభక్షుకు అభినందనలు తెలిపారు.

గుండుగొలనులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

భీమడోలు :టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో మండలంలోని గుండుగొలను గ్రామంలో టిడిపి నేతలు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో టిడిపి నేతలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి కొన్ని వివరాలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి భీమడోలు మండల అధ్యక్షులు సిరిబత్తిన కొండబాబు, ఎఎంసి మాజీ చైర్మన్ పుల్లయ్యనాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు కరణం పెద్దిరాజు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహించినా, అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలకు సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందించనున్నట్లు వివరించారు.

సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతి ఒక్క రైతు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండి భూమిని, తన ఆర్థిక స్తోమతను కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి సిహెచ్.శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రమైన వ్యవసాయ కార్యాలయం వద్ద సేంద్రీయ వ్యవసాయంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు అంశాల్లో అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని పలువురు రైతులను సన్మానించారు.

నేరాలు - ఘోరాలు

తెలంగాణ మద్యం పట్టివేత

జీలుగుమిల్లి :మండలంలోని తాటియాకులగూడెం అంతర్ రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద ఎస్ఇబి అధికారులు తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఇబి సిఐ మణికంఠరెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం వరంగల్ నుంచి ఆంధ్రాలోని అంబేద్కర్ కోనసీమ జిల్లాకు తరలిస్తున్న ఆరు ఫుల్ బాటిళ్ల మద్యాన్ని పట్టుకున్నారు. మద్యాన్ని, లారీని సీజ్ చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

సెల్‌ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసులు రికవరీ చేసిన చోరీకి గురైన సెల్‌ఫోన్లను బాధితులకు అందించారు. ఐదు విడతల్లో రూ.ఒక కోటికి పైగా విలువైన సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసినట్లు ఎస్పి రాహుల్‌దేవ్‌శర్మ ఏలూరులోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. సెల్‌ఫోన్ల చోరీలకు సంబంధించి ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వాటిని బాధితులకు అందించారు.

వివేకానంద జీవితం యువతకు ఆదర్శం



గణపవరంలో...

ప్రజాశక్తి - ఏలూరు

స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని జిల్లా స్థాయి జాతీయ యువజనోత్సవం ఏలూరు సెట్‌వెల్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్ర పటానికి సెట్‌వెల్ మేనేజర్ పివిఎన్.సత్యనారాయణ, పర్యాటక శాఖ మేనేజర్ పట్టాభి రామన్న పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా స్థాయి జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఇటీవల వేగవరం హేలాపురి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు సర్టిఫికేట్‌తో పాటు మెమెంటోలు అందించారు.

గణపవరం : స్వామి వివేకానంద జీవితం నేటి యువతకు ఆదర్శమని రుద్రరాజు ఫౌండేషన్ ఛైర్మన్ ఆర్‌విఎస్.రాజు అన్నారు. స్థానిక డిగ్రీ కాలేజీలో స్వామి వివేకానంద 160వ జయంతి సందర్భంగా గురువారం జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ఈ సంద ర్భంగా నిర్వహించిన సమావేశానికి కాలేజీ ప్రిన్సిపల్ పి.ని ర్మల కుమారి అధ్యక్షత వహించారు. ఆర్యవైశ్య రాజు మాట్లా డుతూ వివేకానంద తన ప్రసంగాలతో యువతను ప్రభావి తం చేశారన్నారు. అనంతరం వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డిగ్రీ కాలేజీలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న ఆదర్శ విద్యార్థిగా ఎంపిక చేసిన ఆర్ ఆదర్శ్‌కు రుద్రరాజు ఫౌండేషన్ తరపున రూ.వెయ్యి నగదు, ప్రశంస పత్రాలు అందించారు.

భీమడోలు : మండలంలోని పలు గ్రామాల్లో స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా భీమడోలులో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి గ్రామ సర్పంచి పి.సునీతమాన్‌సింగ్, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా హాజరయ్యారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పూళ్ల శాఖా గ్రంథాలయంలో స్వచ్ఛంద సంస్థ మానవతా ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.

కైకలూరు రూరల్ : మండలంలోని ఆటపాక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయమంగళ వెంకటరమణ, తెలుగుయువత జిల్లా అధ్యక్షులు రెడ్డి సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి, స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గోపాలకృష్ణయ్య సేవలు ఆదర్శం

ప్రజాశక్తి - భీమడోలు

నిజాయతీగా నిబద్ధతతో రాజకీయాలకు అతీతంగా జనరంజక పాలన అందించిన అప్పటి సర్పంచి మంచెం గోపాలకృష్ణయ్య సేవలు ప్రస్తుత తరానికి ఆదర్శప్రాయమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచి పి.సునీత మాన్‌సింగ్ ఆధ్వర్యంలోని పాలకమండలి అంగీకారం మేరకు ఏర్పాటుచేసిన మంచెం గోపాల కృష్ణయ్య శిలా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన అభిమానులు, గ్రామస్తులు, ఇతర ప్రముఖులు, దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాల్లో ఉన్నవారు సైతం హాజరయ్యారు. ఆయన శిలా విగ్రహానికి పూలమాలవేసి సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న భీమడోలు సిఐ వెంకటేశ్వరరావు మంచెం గోపాలకృష్ణయ్య సర్పంచిగా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమ నిర్వాహకులుగా వ్యవహరించిన విగ్రహ నిర్మాణ కమిటీ ఛైర్మన్ ఈత కోట సుబ్బారావు కార్యక్రమ నిర్వాహకులుగా, సభాధ్యక్షులుగా వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐతోపాటు భీమడోలు సర్పంచి సునీత మాన్‌సింగ్, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీరంగా హాజరయ్యారు.


లంకపాకలలో ధర్మన్న వర్ధంతి సభ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్మన్న 22వ వర్ధంతి సభ లంకపాకల గ్రామంలో చింతల కృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ధర్మన్న చిత్రపటానికి న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కారం రాఘవ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మన్న ఖమ్మం జిల్లా బ్రాహ్మణపల్లె గ్రామంలో అగ్రకులంలో జన్మించి చిన్న వయసులోనే విప్లవపోరుబాట పట్టారన్నారు. ధర్మన్న ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అలివేరు సర్పంచి కారం లక్ష్మి, అంతర్వేదిగూడెం ఎంపిటిసి సభ్యులు కె.గోవిందరాజు, చింతల కృష్ణ, కె.పోతురెడ్డి, టి.బాబురావు, కెఎన్.రాజు పాల్గొన్నారు

పేదలు, కార్మికుల పక్షానే ప్రజాశక్తి

క్యాలెండర్ ఆవిష్కరణలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - నూజివీడు

ప్రజాభిమానమే గొప్ప శక్తిగా అలుపెరగని అవిశ్రాంత పోరాటం చేస్తున్న ప్రజాశక్తి పత్రికా లోకంలో ఎల్లవేళలా ఆదర్శనీయమని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, కార్మిక వర్గ అభ్యున్నతికి ప్రజాశక్తి నిత్యం పోరాడుతుందన్నారు. ఎన్ని పత్రికలు, టీవీ ఛానళ్లు కొత్తగా వస్తున్నప్పటికీ ప్రజాశక్తి తన ఆశయాన్ని, సిద్ధాంతాన్ని వదలకుండా పోరాడుతున్న తీరు అభినందనీయమన్నారు. అధికారులకు అనేక సమస్యలను ఎత్తిచూపుతూ పరిష్కార దిశగా కొనసాగుతున్న వార్త రచన ప్రశంసనీయమని తెలిపారు. రంగుల క్యాలెండర్‌తో పాటు, అధికారులు వీక్షించేందుకు వీలుగా తేదీలు అర్థమయ్యే పద్ధతిలో పెద్ద క్యాలెండర్‌లు వేసిన ఘనత తెలుగులో ఒక్క ప్రజాశక్తికే దక్కుతుందని సబ్ కలెక్టర్ ప్రశంసల జల్లు కురిపించారు. ఈ కార్యక్రమంలో విలేకరి అబ్బదాసరి వసంతరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం :వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా క్యాలెండర్‌ను మండలంలోని తాడువాయి శివాలయం వద్ద గురువారం ఆవిష్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల సమక్షంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు సత్రం లక్ష్మణరావు, ఆలయ కమిటీ ఛైర్మన్ పాపోలు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

గుండెపోటుతో వ్యక్తి మృతి



షేక్ అబ్బాస్ మృతదేహం

ప్రజాశక్తి - నూజివీడు

పేకాట శిబిరం వద్దకు పోలీసులు రావడంతో పరుగు తీస్తున్న చికెన్ వ్యాపారి షేక్ అబ్బాస్(37) గుండెపోటుతో మృతి చెందారు. నూజివీడు పట్టణంలోని పెద్ద చెరువు సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. పోలీసులను చూసి పేకాటరాయుళ్లు పరారయ్యారు. ఈ క్రమంలో షేక్ అబ్బాస్ పారిపోతుండగా గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అబ్బాస్‌ను పోలీసులు వారి జీపులో నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన

నూజివీడు పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట మృతుడు షేక్ అబ్బాస్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు గురువారం రాత్రి ఆందోళన చేపట్టారు. పోలీసులు దాడి చేయడంతోనే అబ్బాస్ మృతి చెందాడని బంధువులు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. న్యాయం జరిగే వరకూ ఆందోళన విరమించేది లేదని నిరసనకారులు స్పష్టం చేస్తున్నారు. ఆందోళన నేపథ్యంలో పోలీస్ స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది.

జూదాలు వద్దు - క్రీడలు ముద్దు



ఏలూరులో..

ప్రజాశక్తి - ఏలూరు

చెస్ పోటీలు విద్యార్థుల్లో మేధో శక్తి పెంచుతాయని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సమన్వయ అధికారి (ఆర్ఎంఒ) డాక్టర్ పిఎఆర్ఎస్.శ్రీనివాస్ అన్నారు. డివైఎఫ్ఐ సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏలూరులో జరుగుతున్న జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పిఎఆర్ఎస్.శ్రీని వాస్ మాట్లాడుతూ ప్రతి ఏటా సంక్రాంతికి ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయ మన్నారు. ఐద్వా నగర కార్యదర్శి పి.వెంకట రమణ మాట్లాడుతూ యువతకు పండుగ సమయంలో చెడు వ్యసనాలకు వెళ్లకుండా ఈ ఆటల పోటీలు ఉపయోగ పడు తు న్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, డివైఎఫ్ఐ నగర కమిటీ కార్యదర్శి పి.శివశంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, సిఐటియు నాయకులు పి.కిషోర్, విజయ్ జ్యూయలర్స్ శ్రీనివాసరావు, చెస్ కోచ్ డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

కామవరపుకోట :మండలంలోని రాయికంపాడులో కెవిపిఎస్, సిఐటియు, అంగన్‌వాడీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా యువత ఈ పోటీల్లో పాల్గొని సమాజంలో క్రీడా స్ఫూర్తిని మేలు కొల్పాలన్నారు. కోడిపందేలు, పేకాట వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామ సర్పంచి వేముల నాగేశ్వరరావు మాట్లాడుతూ సంక్రాంతికి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలని, కోడిపందేలు, పేకాట వంటి ఆటలు ఆడకూడదని చెప్పారు. అనంతరం ముగ్గుల పోటీలో గెలుపొందినవారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో దుర్గారావు, వార్డ్ మెంబర్ జయరాజు, అంగన్‌వాడీ కార్యకర్త రాణి మేరిస్టెల్లా పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయిగూడెం గ్రామంలోని అరుంధతి కాలనీలోని బాబు జగజీవన్‌రావ్ విగ్రహం వద్ద డప్పు కళాకారుల సంఘం కెవిపిఎస్ అనుబంధం ఆధ్వర్యంలో బుధవారం డప్పు కళాకారుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ నేపథ్యంలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. పోటీలో గెలుపొందిన డప్పు కళాకారు లకు స్థానిక ఎస్ఐ జయబాబు పట్టు వస్త్రాలతో సన్మానించారు. పోటీలో మొదట విజేత ఉండ్రాజు వరకు పెంటయ్య, రెండో విజేత దండపాటి వెంకటేశ్వరావులను పట్టు వస్త్రాలతో సన్మానించారు.

భీమడోలు :గుండుగొలను గ్రామపంచాయతీ ఉపసర్పంచి, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు ముదుండి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే సంక్రాంతి సంబరాలు గురువారం ప్రారంభమయ్యాయి. సంబరాలను భీమడోలు సిఐ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. సాంప్రదాయ రీతిలో సంక్రాంతి సంబరాలు చేపట్టిన నిర్వాహకులను అభినందించారు. అనంతరం సంబరాల నిర్వాహకులు ముదుండి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా కబడ్డీ, బాల్‌గేమ్స్, ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బుట్టాయగూడెం : సంక్రాంతి పండుగ సందర్భంగా, ప్రజలు కోడిపందేలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు బానిసలు కాకుండా ఉండేందుకు గుబ్బల మంగమ్మ తల్లి ఆలయ సమీపంలోని మారుమూల గ్రామం కామవరంలో మండల స్థాయిలో నిర్వహించే సాంప్రదాయ ఆటల పోటీలను వెలుగు అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మడివి నాగేశ్వరరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు, అడ్వకేట్ ఉద్దండం ఏసుబాబు గురువారం ప్రారంభించారు. ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు పురుషులకు వాలీబాల్, మహిళలకు కబడ్డీ, ముగ్గుల పోటీలను నిర్వహస్తున్నామని తెలిపారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక డాంగేనగర్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఆహ్లాదంగా నిర్వహించారు. డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆరో వార్షికోత్సవం, సంక్రాంతి పండుగ నేపథ్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వజ్ర కిరణ్, సామజిక వేత్త కెఎల్ఎన్.ధనకుమర్ మాట్లాడారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో మొట్టమొదటి మహిళా ఆటో డ్రైవర్ దాసరి సరస్వతిని శాలువాతో సత్కరించారు.



కామవరపుకోటలో..

టి.నరసాపురం : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని బొర్రంపాలెంలో రెండు రోజులుగా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలకు జీలుగుమిల్లి సిఐ జి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ కె.సతీష్‌కుమార్ బహుమతులు అందించారు.

చింతలపూడి : క్రీడల మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎంఎల్ఎ ఎలిజా అన్నారు. మండలంలోని రాఘవపురం గ్రామంలో కోండ్రు కిషోర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ యువతను కిషోర్ క్రీడల్లో బాగా ప్రోత్సహించేవారని, మంచి వ్యక్తిని కోల్పోయమని అన్నారు. క్రీడల్లో పోటీతత్వం ఉండాలని, గెలుపు ఓటములు సహజమని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు.

వేలేరుపాడు : సంక్రాంతి నేపథ్యంలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీలను స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి మిక్సీని పిడిగెల ధరణి గుళ్లవాయి గ్రామం, రెండో బహుమతి కుక్కర్‌ను సోడే జ్యోతి మద్దిగట్ల గ్రామం, మూడో బహుమతి డిన్నర్ సెట్‌ను కంగాల వెంకటరమణ పాత పూచిరాల గ్రామాలకు చెందినవారు గెలుపొందారు. ఎస్ఐ ఆర్.శ్రీను దంపతుల చేతుల మీదగా బహుమతులు అందించారు.

బుట్టాయగూడెం : పోలవరం డిఎస్‌పి లతాకుమారి, బుట్టాయగూడెం ఎస్ఐ జయబాబు నేతృత్వంలో మండలంలోని దొరమామిడి, బూసరాజు పల్లి గ్రామాల్లో కోడిపందేలు, పేకాట నిర్వహించకుండా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుట్టాయగూడెం ఎస్ఐ జయబాబు, తహశీల్దార్ ఎస్ఎస్.శాంతి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

మానవత సేవలు అభినందనీయం

భీమడోలు :మానవతా సంస్థ భీమడోలు శాఖ సేవలు అభినందనీయమని మానవతా జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. భీమడోలుకు చెందిన కొల్లి సాయికుమార్ పూణేలోని డిఫెన్స్ అకాడమీ ఇంజినీరింగ్ కాలేజీలో ఎంటెక్ చదువుతూ టరం ఫీజులు కట్టలేని స్థితిలో ఉండగా దీనిని గుర్తించిన భీమడోలు శాఖ సదరు విద్యార్థికి టరం ఫీజు కట్టే నిమిత్తం రూ.22 వేలు అందించారు. ఈ కార్యక్రమాన్ని భీమడోలులో నిర్వహించారు. ఇదేవిధంగా గురువారం పూళ్లలో నిర్వహించిన మరో కార్యక్రమంలో విద్యలో చూపిన ప్రతిభ కారణంగా ఉన్నత ఉద్యోగం సాధించిన విద్యార్థికి ప్రతిభ పురస్కారం కింద రూ.25 వేల నగదును అందించారు. అతను ఉన్నత స్థాయికి ఎదగటానికి సహకరించిన అతని తల్లిదండ్రులతో పాటు సదరు ఉద్యోగిని సత్కరించారు. ఈ సందర్భంగా సదరు ఉద్యోగి భీమడోలు మానవతాశాఖ సభ్యునిగా కొనసాగుతూ సేవా కార్యక్రమంలో పాల్గొంటారని హామీ ఇచ్చారు.